## విద్యారంగ సమస్యలపై శాసన మండలిలో చర్చించండి

ఎమ్మెల్సీ కవితకు పీడీఎస్‌యూ విజృంభణ వినతి



రాష్ట్రంలో విద్యారంగ సమస్యలపై శాసనమండలిలో చర్చించాలని ఎమ్మెల్సీ కవితను పీడీఎస్‌యూ విజృంభణ నాయకులు కోరారు. ఈ మేరకు ఆమెను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం విద్యార్థి నేతలు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా నేటికీ విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రిని నియమించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యారంగంలో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని, వాటిని పరిష్కరించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. రాష్ట్ర బడ్జెట్లో 20% నిధులను విద్యారంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అల్లూరి విజయ్, పల్లెబోయిన జానీ, పవన్, శ్రీహరి, సాయి వర్ధన్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు. *– ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 8*

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి: ఎమ్మెల్యే కృష్ణారావు



మహిళా దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే కృష్ణారావుతో బీఆర్ఎస్ పార్టీ మహిళల నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 8: మహిళలు, పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణించే సత్తా ఉందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కూకట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకలలో ఎమ్మెల్యే కృష్ణారావు, మహిళా కార్పొరేటర్లు పగుడాల శిరీషా, సబియా బేగం, మహేశ్వరి, రోజా దేవితోపాటు బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాళ్లతో కలిసి కేక్‌కట్ చేశారు. మహిళా నేతలందరిని ఎంఎల్ఏ పూల బోకేలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు స్వయం సమృద్ధిని సాధించాలని, ఆయా రంగాలలో నైపుణ్యాలను సాధించి ముందుకెళ్లాలన్నారు. గత ప్రభుత్వం మహిళలకు సముచిత స్థానం కల్పించిందని, నేటి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు.. మహిళలకు స్కూటీలు, కల్యాణలక్ష్మి నగదుతోపాటు తులం బంగారం, రూ.2500 పెన్షన్‌ను ఇస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఏడాదిన్నర కాలమైనా హామీలను నెరవేర్చలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ మహిళలను మోసం చేసిందని వారి హక్కులను కాపాడడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నేతలు ఉన్నారు.

## మిలియన్ మార్చ్ డేను జయప్రదం చేయండి




తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న మిలియన్ మార్చ్ డే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జేఏసీ ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఉద్యమకారులకు 250గజాల ఇంటి స్థలం, రూ.30వేల గౌరవ వేతనం ఇస్తామనే హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 10న అమరజ్యోతి నుంచి గన్‌పార్కు వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామని, మేధావులు, ప్రజా సంఘాలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం మిలియన్ మార్చ్‌డే పోస్టర్లను జేఏసీ సలహాదారులు బోయపల్లి రంగారెడ్డి, చైర్మన్ ఉల్తాన్ యాదగిరి, కోశాధికారి చంద్రన్న ప్రసాద్, మహిళా అధ్యక్షురాలు కె. మాధవి రెడ్డి, వేముల యాదగిరి తదితరులు పాల్గొన్నారు. *– ఖైరతాబాద్, మార్చి 8*


## ఎంబీఎస్సీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ చేయాలి



సమావేశం అనంతరం నినదిస్తున్న ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 8: రాష్ట్రంలో ఎంబీఎస్సీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని 57 ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటేశం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం.. ఎంబీఎస్సీ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఈ మేరకు తీర్మానం చేయాలని విజ్ఞప్తి చేశారు. తమకు కుల ధ్రువీకరణ పత్రాలు తహసీల్దార్ ద్వారా ఇవ్వాలన్నారు. వచ్చే నెలలో జరిగే మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ బాధ్యతలు ఈసారి ఎంబీఎస్సీ కులాలకే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి రాష్ట్ర నాయకులు ఉపదే సనధన్ మాంగ్ గారోడి, కురువ వెంకన్న, మాదాసి కురువ, కొల్పుల నవీన్, పంబాల ఎల్లేశ్, కురువ బాలరాజు, ఉపదే మహేశ్, కాంబ్లే విజయ్, కాంబ్లే గోపి, కొల్పుల గోవర్ధన్, సకట్ సంజీవ్, జీత్లాల్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి



మహిళా ఉద్యోగులను సత్కరించిన యూనియన్ నేతలు

సిటీ బ్యూరో, మార్చి 8(నమస్తే తెలంగాణ): వైద్య, ఆరోగ్య శాఖలో మహిళా దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ వైద్య, ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదమ్మ అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మహిళా దినోత్సవం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఏటా అన్ని క్యాడర్లలో ఉత్తమ సేవలందించిన మహిళా ఉద్యోగులను అవార్డులతో సత్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలపై సంబంధిత మంత్రి మూడు నెలలకోసారి గ్రీవియన్స్ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



కన్హాలో 3కె రన్‌లో పాల్గొన్న కేంద్ర యువజన, క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**– కేంద్ర యువజన, క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ**
**– కన్హాలో సైక్లోథాన్ 3కె రన్ విజయవంతం**

**నందిగామ, మార్చి 8:** మహిళలు అన్ని రంగాలలో రాణించాలని కేంద్ర యువజన, క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు. నందిగామ మండలం కన్హా శాంతివనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో శనివారం సైక్లోథాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర యువజన, క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ముఖ్యఅతిథిగా హాజరై వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, క్రీడాకారులతో కలిసి సైక్లోథాన్ 3కె రన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాలలో రాణించాలని భారత ప్రధాని నరేంద్రమోడి నాయకత్వంలో మహిళలకు అన్ని రంగాలలో సముచిత స్థానం కల్పిస్తున్నారని తెలిపారు. ఫిట్ ఇండియా పేరుతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం, ధ్యానం చేయడం క్రీడలు ఆడటం సైకిల్ తొక్కడం వంటివి ప్రతి రోజు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయి యూనివర్సిటీలతో పోటీపడేలా ఎదగాలి

**500 కోట్ల నిధులతో కోఠిలోని వీరనారీ చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి**



కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో శంకుస్థాపన చేస్తున్న సీఎం

సుల్తాన్ బజార్,మార్చి 8: వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయి యూనివర్సిటీలతో పోటీపడేలా ఎదగాలని సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పోటీలోని వీర నారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో రూ.535కోట్ల నిధులతో నూతన భవన నిర్మాణాలు, చారిత్రాత్మకమైన పురావస్తు కట్టడాల పునరుద్ధరణ పనులకు గాను ఆయన, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం కుమార్, మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డిలతో కలిసి భూమి పూజ చేసి నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అంతకు ముందు వర్సిటీ ఎన్‌సీసీ విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డికి గౌరవ వందనం సమర్పించారు.దర్బార్ హాల్లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఆయన తిలకించారు. అనంతరం వర్సిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన సభా వేదికపై మంత్రులు అధికారులతో కలిసి వచ్చి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు, కళాశాల ప్రిన్సిపాల్‌లు, లెక్చరర్లు, అధ్యాపకులు, బోధన బోధనేతర సిబ్బంది, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నర్సయ్య, సుల్తాన్ బజార్ ఏసీపీ శంకర్, సుల్తాన్ బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి లతో కలిసి బందోబస్తును పర్యవేక్షించారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రమాదం తృటిలో తప్పింది. కాగా, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య భూమి పూజ చేసిన అనంతరం ఇటుకలను పేర్చే క్రమంలో ఒక్కసారిగా గుంతలో పడిపోతుండగా.. వెంటనే తేరుకున్న సీఎం అక్కడి నుంచి వెళ్లిపోయారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క

చిక్కడపల్లి, మార్చి 8:ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం అధ్యక్షుడు తిప్పర్తి యాదయ్య ఆధ్వర్యంలో నూతనంగా ముద్రించిన డైరీని శనివారం మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన వివరాలను సంఘం అధ్యక్షుడు తిప్పర్తి యాదయ్య బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ శ్యామ్, డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధి లల్లు ప్రసాద్ యాదవ్,యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్‌మోహన్, అసోసియేట్ ప్రెసిడెంట్ అశోక్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చెవ్వ కృష్ణ, సంయుక్త కార్యదర్శి బి.రమేశ్, మండల రవి పాల్గొన్నారు.

## ఆర్టీసీ మహిళా అధికారులు, సిబ్బందికి సన్మానం



రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహాత్మా గాంధీ బస్‌స్టేషన్‌ను సందర్శించి ప్లాట్ ఫాం లలో ఉన్న మహిళా ప్రయాణికులకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పూలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంజీబీఎస్ బస్ స్టేషన్‌లో మహిళా అధికారులు, సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రయాణికులకు గులాబీ పూలు, స్వీట్లు ఇచ్చి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ ఎంజీబీఎస్ బస్ స్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, టీఎస్ ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్ రీజినల్ మేనేజర్ శ్రీలతతోపాటు మహిళా ప్రయాణికులు, ఆర్టీసీ మహిళా ఉద్యోగులతో కలిసి బస్సులో ప్రయాణం చేశారు. రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, ఈడీ రాజశేఖర్, ఆర్ఎం శ్రీలత, సీఆర్ఎం శ్రీనివాస్, ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. *– సుల్తాన్ బజార్, మార్చి 8*

## బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**పటోళ్ల కార్తీక్ రెడ్డి**



బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించిన రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పటోళ్ల కార్తీక్ రెడ్డి

బండ్లగూడ, మార్చి 8 : రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పటోళ్ల కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు రావుల కొల్ల నాగరాజు ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు కార్తీక్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కార్తీక్ రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలన పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. త్వరలోనే పలు నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రానున్నట్లు తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు ముగ్గు చూపుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారు కాంగ్రెస్ నాయకులు గాజుల చంద్ర శేఖర్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్, శ్రవణ్, రాంబాబు, నాగరాజ్, సుభాని, బాలాజీ, నరేశ్, మహేశ్ గౌడ్, రామ్‌కుమార్, రాజు ఉన్నారు. కార్యక్రమంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ నాయకులు, గంగని రవికుమార్, మహేశ్, శాంతకుమార్, రాజ్‌కుమార్, శాంతిబాయ్, హాజీ తదితరులు పాల్గొన్నారు.

## హోప్ యాడ్ టీవీ, సుజనరంజని సంగీత కచేరీ



మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హోప్ యాడ్, సుజనరంజని సంయుక్తంగా శనివారం శ్రీవిద్య జానకిరామన్ గాత్ర సంగీత కచేరీ ఏర్పాటు చేశాయి. కచేరీలో త్యాగరాజ స్వామి, ముత్తు స్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, ముత్తయ్య భాగవతార్ కీర్తనలు ఆలపించారు. వయోలిన్ పవన్ సింగ్, మృదంగం రామకృష్ణ, ఘటం బాలసుబ్రహ్మణ్యం వాయించారు. ఈ సందర్భంగా నిత్యజీవితంలో మహిళల పాత్రను మహీధర సీతారాం వివరించారు. హోప్ డైరెక్టర్ సునీత కళాకారులను సత్కరించారు. *– సిటీబ్యూరో, మార్చి 8(నమస్తే తెలంగాణ)*

## సఫారీ స్టీల్త్ స్పెషల్ ఎడిషన్ విడుదల




జూబ్లీహిల్స్‌లోని టాటా వెంకటరమణ ఉమెన్స్ షో రూమ్‌లో టాటా వారి సరికొత్త సఫారీ స్టీల్త్ స్పెషల్ ఎడిషన్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఇండియన్ మార్కెట్‌లో టాటా సఫారీ విడుదలై 27 ఏండ్లు పూర్తైన సందర్భంగా 2700 టాటా సఫారీ స్టీల్త్ ఎడిషన్, టాటా హారియర్ ఎస్‌యూవీను టాటా మోటార్స్ ఆధ్వర్యంలో మార్కెట్లోకి విడుదల చేశారు. వీవీసీ మోటార్స్ ఎండీ వీవీ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో టీవీ నటి తేజస్విని అమర్దీప్ చేతుల మీదుగా షోరూం మేనేజర్ నిరోషతో కలిసి కొత్త సఫారీ స్టీల్త్ ఎడిషన్‌ని మార్కెట్‌లోకి విడుదల చేశారు. *–సిటీబ్యూరో, మార్చి 8(నమస్తే తెలంగాణ)*

## పద్మశాలీలకు వాటా దక్కేదాక ఉద్యమం..

**అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి**




సమావేశంలో మాట్లాడుతున్న కందగట్ల స్వామి

హిమాయత్‌నగర్, మార్చి8: దేశంలోని పద్మశాలీ కులస్తులకు జనాభా ప్రాతిపదికన వాటా దక్కేదాక ఉద్యమాన్ని కొనసాగించాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి పిలుపునిచ్చారు. సంఘం 17వ జాతీయ మహాసభల సందర్భంగా శనివారం నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో వెనుకబడిన పద్మశాలీ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత ఇచ్చి అభ్యున్నతి కోసం తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని పద్మశాలీలకు ఒక రాజ్యసభ, నాలుగు ఎమ్మెల్సీలు, నాలుగు కార్పొరేషన్ల చైర్మన్ పదవులను ఇవ్వాలన్నారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే భారీ బహిరంగ సభకు పద్మశాలీలు అధిక సంఖ్యల్లో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం జాతీయ గౌరవ అధ్యక్షుడు శ్రీధర్ ఎన్.సుంకుర్వార్, జాతీయ ప్రధాన కార్యదర్శులు గడ్డం జగన్నాథం, వనం విశ్వనాథం, నేతలు వనం దుశ్యంతల, కొక్కుల దేవేందర్, డాక్టర్ పుట్ట పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లి ఎగ్జిబిషన్‌కు విశేష ఆదరణ



అవార్డులు, సర్టిఫికెట్లను అందజేస్తున్న సుధీర్‌రెడ్డి, పారిశ్రామికవేత్తలు తదితరులు

చర్లపల్లి, మార్చి 8 : చర్లపల్లి పారిశ్రామిక వాడలో సీఐఏ, ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు విశేష ఆదరణ లభించిందని తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. పారిశ్రామికవాడలోని సీఐఏ భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన సీఐఏ, ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో-2025 ఎగ్జిబిషన్ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక వాడలో ప్రతి సంవత్సరం ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, వివిధ ఉత్పత్తులకు సంబంధించి 106 స్టాల్స్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అనంతరం ఎగ్జిబిషన్‌లో ఉత్తమ స్టాల్స్‌కు అవార్డులను అందజేయడంతో పాటు స్టాల్స్ యజమానులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సీఐఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గోవింద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చర్లపల్లి ఐలా చైర్మన్ రోషిరెడ్డి, ఐలా కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, పారిశ్రామికవేత్తలు మియ్యాపురం రమేశ్, టీఐఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోపాల్‌రావు, పీఎస్.మోహన్, మూర్తి, రమేశ్ కృష్ణ, కామేశ్వర్‌రావు, వినోద్ లతో పాటు సిబ్బంది, పెద్ద సంఖ్యలో పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పలువురు నృత్యకారుల భరత నాట్యం, కూచిపూడి, హాస్య వల్లరి ప్రదర్శనలు సందర్శకులను ఆద్యంతం అలరించాయి. ప్రదర్శనలో భాగంగా శనివారం కెనడా, టొరంటో నుంచి విచ్చేసిన భరత నాట్య కళాకారిణి శక్తి సంజన సిరాలా తన ప్రదర్శనలో అర్ధనారీశ్వర స్తోత్రం, దేవి శబ్దం, ప్రదోషం, బృందావని తిల్లాన అంశాలను ప్రదర్శించి మెప్పించగా, హాస్యబ్రహ్మ డాక్టర్ శంకరనారాయణ రచన వ్యాసంగాలలో, హాస్యవల్లరి చేస్తూ 50వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనను సత్కరిస్తూ కళానృత్యోత్సవం రాగ రమ్య కల్చరల్ అసోసియేషన్ నిర్వాహకులు రమ్య డాక్టర్ శంకరనారాయణ హాస్యవల్లరి, కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రదర్శనలో పుష్పాంజలి, గణపతి కౌతం, నమశ్శివాయతేయ్, ఒకపరి కొకపరి, గణపతి తాళం, అదిగో అల్లదిగో, నగుమోము గలవని, ముద్దుగారే యశోద, ఝుమ్ ఝుమ్ తనన, అయిగిరినందిని అంశాలని రేవతి రామినేని, పూర్ణిమ రామకృష్ణ శిష్య బృందం ప్రదర్శించి మెప్పించారు. *– కొండాపూర్, మార్చి 8*

